క్లుప్తంగా

ఎమ్మెల్యే పాల్గుణ సహకారంతో కంటి ఆపరేషన్



కంటి ఆపరేషన్ చేయించుకున్న బొజ్జయ్యతో వైద్యులు

డుంబ్రిగుడ: మండలంలోని అరకు సంతబయలు గ్రామానికి చెందిన గెమ్మెలి బొజ్జయ్య అనే పేద గిరిజనుడికి రెండు కళ్లు కనిపించకపోవడంతో అరకు ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో విశాఖపట్నం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేశారు. ఎమ్మెల్యే సూచన మేరకు వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు మురళీపట్నాయక్ సాయంతో విశాఖపట్నం ఆస్పత్రికి తరలించి కంటి ఆపరేషన్ చేయించినట్టు మంగళవారం బొజ్జయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. ఉచితంగా కంటి ఆపరేషన్ చేసిన ఎల్‌వీ ప్రసాద్ ఆస్పత్రి వైద్యులకు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రత్యేక ధన్యావాదాలు తెలిపారు.

సీసీ రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం



జంగల్‌మెట్ట గ్రామంలో సీసీరోడ్డు పనులు ప్రారంభిస్తున్న సర్పంచ్, ఎంపీటీసీలు

జి.మాడుగుల: మండలంలోని జి.మాడుగుల పంచాయతీ జంగల్‌మెట్ట గ్రామంలో మంగళవారం సీసీరోడ్డు నిర్మాణ పనులను సర్పంచ్ కిముడు రాంబాబు, ఎంపీటీసీలు మత్స్యరాస విజయకుమారి, గబ్బాడి సన్యాసిదొర ప్రారంభించారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ప్రత్యేక చొరవతో జంగల్‌మెట్టలో సీసీ రోడ్డు నిర్మాణానికి రూ.20 లక్షలు మంజూరైనట్టు వారు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అడపా బాబూరావు, సూర్యప్రకాష్‌నాయుడు, ఇంజినీరింగ్ అసిస్టెంట్ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మరుగుదొడ్ల పరిశీలన



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న శోభ సోమేశ్వరి

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రంలో స్వచ్ఛభారత్ కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్ నిధులు రూ.3 లక్షలతో నిర్మించిన మరుగుదొడ్లను స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి మంగళవారం పరిశీలించారు. మరుగుదొడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ వినియోగించకపోవడానికి కారణాలను కార్యదర్శి వరలక్ష్మిని అడిగితెలుసుకున్నారు. మరుగుదొడ్లు వినియోగంలోకి తెచ్చేవిధంగా చర్యలు చేపడతామన్నారు.

వలంటీర్ మృతికి సంతాపం



రవి కుమార్(ఫైల్)

అనంతగిరి: మండలంలోని కొండిబ పంచాయతీ లింబగుడ గ్రామానికి చెందిన గ్రామ వలంటీర్ గుబ్బాయి రవి కుమార్(37) గుండెపోటుతో సోమవారం రాత్రి మృతి చెందాడు. స్నేహితులతో కలిసి విహారయాత్రకు వెళ్లిన ఆయనకు ఒక్కసారిగా గుండె పోటు రావడంతో తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఎస్.కోట ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. వలంటీర్ మృతిపట్ల పలువురు సంతాపం వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారానికి సమ్మెకు సిద్ధం

అరకులోయటౌన్: సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సమ్మె చేయనున్నట్టు ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.గంగరాజు తెలిపారు. మంగళవారం గిరిజన సంఘం కార్యాలయంలో కార్మికులతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. 22వ తేదీ తరువాత సమ్మె చేస్తామని చెప్పారు. ఈ సమావేశంలో యూనియన్ నాయకులు వి.బాబురావు, కె.ఒనాది, నరసింహ, అంజలిరావు, సంజీవరావు, సురేష్ కుమార్ పాల్గొన్నారు.

పేదల ఆరోగ్యానికి భరోసా..
జగనన్న సురక్ష

పేదలకు ఆరోగ్య భరోసా అందించాలన్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యం నెరవేరుతోంది. ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాలకు జనం పోటెత్తుతున్నారు. శిబిరాలలో వైద్య నిపుణులు ప్రత్యేక శ్రద్ధతో వైద్యసేవలందిస్తున్నారు. మారుమూల గ్రామాల్లో ఉన్న ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్యసేవలందుతున్నాయి.



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లను పంపిణీ చేస్తున్న ఎంపీపీ ఉషారాణి, లక్ష్మణ్‌కుమార్



కొత్తపాలెంలో పౌష్టికాహారం స్టాళ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ కోరాబు అనూషదేవి



యార్లగడలో మందులు పంపిణీ చేస్తున్న వైద్య సిబ్బంది

అరకులోయ రూరల్: జగనన్న ఆరోగ్య సురక్షతో పేదప్రజల ఆరోగ్యానికి భరోసా లభిస్తోందని, ఈ కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ రంజపల్లి ఉషారాణి తెలిపారు. మండలంలోని చిన్నలబుడు పంచాయతీ కేంద్రంలో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఎంపీపీ రంజపల్లి ఉషారాణి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్‌లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు వేర్వేరుగా మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని చెప్పారు. ఈ శిబిరంలో ప్రత్యేక వైద్య నిపుణులు 316 మందికి వైద్యసేవలందించారు. నడవలేని స్థితిలో ఉన్న రోగులను వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు లక్ష్మణ్‌కుమార్, పార్టీ నాయకులు రంజిత్‌కుమార్, నర్సింగ్‌లు శిబిరాలకు తరలించి వైద్యపరీక్షలు చేయించారు. వైద్యనిపుణులు నాగేంద్రబాబు, గీతాంజలి, కమల కుమారి, గాయత్రీ, విన్నిల, ఏఎంసీ చైర్మన్ రాజరమేష్, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి హస్తినకుమార్(శ్రీను), సర్పంచ్ ఉపేంద్ర, ఎంపీటీసీ సభ్యులు సీత, దురియ ఆనంద్‌కుమార్ పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలోని బరడ పంచాయతీ కేంద్రంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించి, 478 మందికి వైద్య పరీక్షలు జరిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ పార్వతి, ఎంపీటీసీ నోట్బో, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మల్లికార్జున్, వైద్యాధికారులు రమేష్,శ్యాంప్రసాద్,ప్రతాప్, వైఎస్సార్‌సీపీ నేతలు తిరుపతి, విక్రమ్, మోహన్, బలరాజు పాల్గొన్నారు.

చింతపల్లిరూరల్: జగనన్న ఆరోగ్య సురక్షను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరాబు అనూషదేవి అన్నారు. మండలంలో కొత్తపాలెం-1 పంచాయతీ పరిధిలో మంగళవారం నిర్వహించిన శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జి.మాడుగుల జెడ్పీటీసీ వెంకటలక్ష్మి, ఎంపీడీవో ఆశాజ్యోతి, తహసీల్దార్ లచ్చపాత్రుడు, సర్పంచ్ వనగల సోమరత్నం, ఈవోపీఆర్డీ శ్రీనివాస్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బెన్నిబాబు, ఐసీడీఎస్ సీడీపీవో రమణి పాల్గొన్నారు.

వై.రామవరం: మండలంలోని యార్లగడ్డ గ్రామ సచివాలయం వద్ద మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో 295 మంది రోగులు వైద్యసేవలు పొందారు. చవిటిదిబ్బలు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈకార్యక్రమంలో ఎంపీటీసీ వీరమళ్ళ సుబ్బలక్ష్మి, సర్పంచ్ పల్లాల పద్మావతి ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికార్లు నరేంద్ర, దినేష్, డిప్యూటీ తహసీల్దార్ కె.సుధాకరరావు, పంచాయతీ కార్యదర్శి పుడిగి భార్గవ చరణ్, ప్రత్యేక వైద్యాధికారి జీవన్, వైఎస్సార్‌సీపీ నాయకులు గుడ్ల త్రిమూర్తులు, కరణం కనకరాజు, దాగేరి గంగరాజు, మాజీ జెడ్పీటీసీ పల్లాల వెంకటరమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



చెరకుంపాలెంలో ఏర్పాటు చేసిన శిబిరం వద్ద రోగులు



గొంటువానిపాలెంలో నిర్వహించిన శిబిరంలో మాట్లాడుతున్న వైద్యాధికారి భాస్కర్



బరడలో రోగులకు వైద్య సేవలు అందిస్తున్న వైద్య సిబ్బంది



పెదార్కూరులో పౌష్టికాహార స్టాల్‌ను పరిశీలిస్తున్న ఎంపీపీ రంగమ్మ

రాజవొమ్మంగి: మండలంలోని చెరకుంపాలెం సచివాలయం వద్ద మంగళవారం జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష ఉచిత వైద్య శిబిరానికి చుట్టు పక్కల గ్రామాల నుంచి అధికసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు. ఈ శిబిరంలో 313 మందికి వైద్యపరీక్షలు నిర్వహించినట్టు హెల్త్ ఎడ్యుకేటర్ సుధాకర్ తెలిపారు. వైద్య నిపుణులు రహీమా నస్రీంమ్, వి.మహీధర్, యామిని ప్రియదర్శని, డాక్టర్ సుష్మా రోగులకు వైద్య పరీక్షలు చేసి, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ దాసరి నాగేశ్వరరావు, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి శింగిరెడ్డి రామకృష్ణ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు కొంగర మురళీకృష్ణ, కోఆప్షన్ మెంబర్ అడపా కామేష్, నాయకులు సత్యనారాయణ, వెంకటరావు, వెంకట రమణ, మాణిక్యం, లక్ష్మి, ఐసీడీఎస్ సీడీపీవో దైవమణి, హెచ్‌వీ వెంకటరమణ, ఎంఎల్‌హెచ్‌పీలు సరస్వతి, మురళి, రమ్య, కుమారి, లక్ష్మి, ల్యాబ్ టెక్నీషియన్ నాగేశ్వరెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు శామ్యూల్, పద్దరాజు, 104 డీఈవో శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

అడ్డతీగల: మండలంలోని గొంటువానిపాలెంలో మంగళవారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో 406 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎల్లవరం పీహెచ్‌సీ వైద్యులు కె.భాస్కర్ ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది సేవలు అందించారు. గొంటువానిపాలెం సర్పంచ్ పల్లాల ఏగులమ్మ,మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ బత్తుల రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కూనవరం: పేదలకు మెరుగైన వైద్యసేవలు అందించడమే జగనన్న ఆరోగ్య సురక్ష లక్ష్యమని ఎంపీపీ పాయం రంగమ్మ అన్నారు. మండల పరిధిలోని పెదార్కూరులో నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సోమవారం ఆమె సందర్శించారు. ఐసీడీఎస్ ఏర్పాటు చేసిన పౌష్టికాహార స్టాళ్లను పరిశీలించారు. ఈ శిబిరంలో 230 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేయడంతో పాటు భోజన వసతి కల్పించినట్టు కూటూరు పీహెచ్‌సీ డాక్టర్ శ్రీనివాసమూర్తి తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మడకం నాగమణి, ఎంపీటీసీ ధర్ముల అమ్మాజీ, వైద్యనిపుణులు శరత్, శ్రీనివాసరావు, సునీల్ కుమార్, రాజీవ్, బాలు తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



పవనగిరి క్షేత్రంలో భువనేశ్వరి అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న భవానీ మాలధారులు

అడ్డతీగల: స్థానిక పవనగిరి క్షేత్రంలో శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. పవనగిరి క్షేత్రం వ్యవస్థాపకులు తణుకు వెంకటరామయ్య, విజయలక్ష్మి దంపతుల ఆధ్వర్యంలో నిత్యం పూజాధికాలు నిర్వహిస్తున్నారు. మూడవ రోజు శ్రీ గిరి దుర్గా భవాని అమ్మవారిని అన్నపూర్ణ దేవిగా అలంకరించి విశేష అర్చనలు చేశారు. కొండపై కొలువైన శ్రీ భువనేశ్వరి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భవానీ మాలదారులు, భక్తులు పూజల్లో పాల్గొన్నారు.



దూసరపాము గ్రామంలో అన్నపూర్ణదేవిగా దర్శనమిచ్చిన కనక దుర్గమ్మ

అన్నపూర్ణాదేవిగా దుర్గమ్మ

రాజవొమ్మంగి: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలోని దూసరపాములో దుర్గమ్మతల్లి మంగళవారం అన్నపూర్ణదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు.

రోడ్డుపై దమ్ము ట్రాక్టర్లు తిరిగితే చర్యలు

కొయ్యూరు: ఇటీవల నిర్మించిన చీడిపాలెం బీటీ రోడ్డుపై ట్రాక్టర్లు దమ్ము చక్రాలతో తిరిగితే చర్యలు తీసుకుంటామని సర్పంచ్ నత్తూరి సోమన్నదొర మంగళవారం తెలిపారు. దమ్ము ట్రాక్టర్లు ఇనుప చక్రాలతో రోడ్లపై తిరగడం వల్ల రహదారి పాడైపోతుందని, ట్రాక్టర్ యజమానులు దమ్ము చక్రాలతో ఈ రోడ్డుపైకి వస్తే తహసీల్దార్, పోలీసులకు ఫిర్యాదు చేస్తామన్నారు. పాడైన రోడ్డుకు వారే బాధ్యత వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు వంతల నారాయణమ్మ,వంతల మణి, లక్ష్మణ్,లోవరాజు, పెద్దమ్ములు,రాజమ్మ పాల్గొన్నారు.

కార్యకర్తను పరామర్శించిన ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ



రమేష్‌ను పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలు అనంతబాబు, ధనలక్ష్మిలు

దేవీపట్నం: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి కోలుకుంటున్న వైఎస్సార్‌సీపీ కార్యకర్తను రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి, ఎమ్మెల్సీ అనంత ఉదయభాస్కర్ మంగళవారం పరామర్శించారు. ఇందుకూరుపేట గ్రామానికి చెందిన బండారు రమేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స అనంతరం కోలుకుంటున్నాడు. ఆయనను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ పరామర్శించి, యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వీరి వెంట వైస్ ఎంపీపీ గారపాటి మురళీ, సచివాలయ మండల కన్వీనర్ కందుల బాబ్జి, పీఏసీఎస్ పర్సన్‌ఇన్‌చార్జి తోట రాజేశ్వరరావు తదితరులున్నారు.

గ్రామీణ రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యం



బొడ్డపుట్టులో రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభిస్తున్న పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: గ్రామాల్లో రోడ్ల నిర్మాణాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తూ నిధులు మంజూరు చేస్తోందని పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని పెదలోచలి పంచాయతీలో కె.పెదబయలు నుంచి బొడ్డపుట్టు వరకు మూడు కిలోమీటర్ల రోడ్డు నిర్మాణ పనులను మంగళవారం ఆమె ప్రారంభించి, మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గ్రామాలను మండలాలకు అనుసంధానం చేసే ప్రక్రియ వేగవంతంగా సాగుతోందని తెలిపారు. ఈ రోడ్డు నిర్మాణానికి ఉపాధిహామీ పథకంలో రూ. కోటి మంజూరు చేసినట్టు చెప్పారు. గ్రామాల్లో ఇంత అభివృద్ధి జరుగుతున్నా ప్రతిపక్షాలు లేనిపోని ఆరోపణలు, విమర్శలు చేస్తున్నాయని తెలిపారు. ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి సమప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కె. సత్యనారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఎస్.మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌లు బి.చినకుమారి, ఐసరం హనుమంతరావు, కిముడు రాంబాబు,ఎస్.రామకృష్ణ,ఎంపీటీసీలు గబ్బాడి సన్యాసిదొర, చిన్నారావు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి ఎస్టీ కమిషన్ చైర్మన్ పరామర్శ



మృతుడు కుటుంబానికి రేషన్ సరుకులు అందిస్తున్న శంకరరావు, రామలక్ష్మి

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ పుట్టచింత గ్రామానికి చెందిన వంతాల మోహన్ అనే గిరిజనుడు ఆదివారం కొత్తూరు గ్రామ సమీపంలోని రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. మంగళవారం కొత్తూరులో పర్యటించిన ఎస్టీ కమిషన్ చైర్మన్ డి.వి.జి.శంకరరావు, కమిషన్ సభ్యురాలు కొర్రా రామలక్ష్మి.. గిరిజనుడు మృతి గురించి తెలుసుకుని ఆ గ్రామానికి వెళ్లి, మృతుడి కుటుంబాన్ని పరామర్శించారు. రామలక్ష్మి సహకారంతో కుటుంబానికి రేషన్ సరకులను అందజేశారు. అనంతరం గ్రామస్తులతో కొంతసేపు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ శెట్టి నీలవేణి, రాష్ట్ర స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ శోభ సోమేశ్వరి, ఎస్టీసెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గంగాధరస్వామి తదితరులు పాల్గొన్నారు.

చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంపునకు కృషి



భీమలోయలో చిరుధాన్యాల పంటను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి

జి.మాడుగుల: రైతులకు అవగాహన కల్పించి, చిరుధాన్యాల సాగు విస్తీర్ణం పెంచేందుకు అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి తెలిపారు. మండలంలోని సొలభం పంచాయతీ భీమలోయ, తాసరుబయలు గ్రామాల్లో శ్రీమత్స్య దేవత రైతు ఉత్పత్తిదారుల సంఘం రైతులు పండిస్తున్న చిరుధాన్యాల పంటలను మంగళవారం ఆమె పరిశీలించారు. ఆయా గ్రామాల్లో 200 ఎకరాల్లో వేసిన సామలు, రాగులు, కొర్రలు, జొన్నల పంటలను పరిశీలించి, రసాయన ఎరువులు వాడకుండా ప్రకృతి సాగు విధానంలో పండించిన రైతులను అభినందించారు. ఎఫ్‌పీవో ద్వారా పంటలు పండించిన రైతులకు మార్కెట్‌లో మంచి గిట్టుబాటు ధర లభిస్తుందని తెలిపారు. ఈ పంటలను రైతు కుటుంబాలు తిని ఆరోగ్యంగా ఉండే విధంగా ఎఫ్‌పీవో కృషి చేయాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఐసరం హనుమంతరావు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తదితరలు పాల్గొన్నారు.

350 మందికి కంటి పరీక్షలు



నేత్ర వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ముంచంగిపుట్టు: స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 350 మందికి పరీక్షలు చేశారు. వీరిలో 46 మందికి కంటి ఆపరేషన్లను అవసరమని గుర్తించారు. ఈ కార్యక్రమంలో కిరసాని రామదాస్, హనుమంతు లజపతిరాయ్, ఆప్తలమిక్ అధికారి సురేష్, శంకర్ ఫౌండేషన్ క్యాంపు కో ఆర్డినేటర్ అశ్వనీకుమార్, స్టాఫ్ నర్సు శిరీష పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాలకు వేలం నేడు

చోడవరం రూరల్: సారా కేసుల్లో స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలను బుధవారం వేలం వేయనున్నట్టు స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఇన్‌స్పెక్టర్ డి.సిహెచ్.జోగమ్మ మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు.

చోడవరం స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో స్టేషన్ పరిధి లో సారా తరలిస్తూ పట్టుబడిన నిందితుల నుంచి రెండు మోటార్ బైకులను స్వాధీనం చేసుకున్నామన్నారు. వీటి వేలంలో పాల్గొనేవారు ఉదయం 9 నుంచి 10 గంటలలోపు రూ.3 వేలు ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో పాడినవారు అదే రోజు మిగిలిన మొత్తాన్ని, జీఎస్టీతో కలిపి చెల్లించి వాహనాలు పొందాలన్నారు.

సమిధ విద్యా కేంద్రం ప్రారంభం



బుక్‌లెట్‌లను అందిస్తున్న విప్ ధర్మశ్రీ

రావికమతం: గిరిజన గ్రామాల్లో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చేందుకు గానూ సమిధ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ములకలాపల్లిలో వయోజన విద్యా కేంద్రాన్ని ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మంగళవారం ప్రారంభించారు. కోల్‌కతా రోటరీ ఇండియా లిటరసీ మిషన్ సహకారంతో ఈ కేంద్రాన్ని ఇక్కడ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా విప్ ధర్మశ్రీ మాట్లాడుతూ విద్యాభివృద్ధికి తమ ప్రభుత్వం విశేషంగా కృషి చేస్తుందన్నారు. మారుమూల గిరిజన గ్రామంలో ఇటువంటి వయోజన విద్యా కేంద్రం ఏర్పాటు కావడం ఆహ్వానించదగ్గ విషయమన్నారు. చిత్తశుద్ధితో కేంద్రం నిర్వహించి గిరిజనుల అభిమానాన్ని చూరగొనాలని నిర్వాహకులకు సూచించారు. వయోజనులకు విద్యా కిట్లు అందించారు. కార్యక్రమంలో రోటరీ ఇండియా ప్రతినిధి శ్రీకిషోర్, సమిధ సంస్థ కార్యదర్శి డి.వీరభద్రరావు, ఎంపీపీ పైల రాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ సత్యదేవ, సర్పంచ్ వంజరి గంగరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా నా భూమి- నా దేశం



వలంటీర్లు సేకరించిన మట్టిని ప్రదర్శిస్తున్న ప్రిన్సిపాల్ ,అధ్యాపకులు,విద్యార్థులు

సాక్షి,పాడేరు: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాతీయ సేవా పథకం రెండు యూనిట్ల ఆధ్వర్యంలో నా భూమి-నాదేశం కార్యక్రమాన్ని మంగళవారం ఉత్సాహంగా నిర్వహించారు. ముందుగా స్వాతంత్ర్య సమరయోధుల చిత్రపటాలకు ప్రిన్సిపాల్ వనుము చిట్టబ్బాయి,అధ్యాపకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్‌ల వలంటీర్లు సేకరించిన మట్టిని అమృత కలశంలో నింపి ప్రదర్శించారు. మట్టి కలశాలలను ఢిల్లీలోని ప్రధానమంత్రి కార్యాలయానికి పంపిస్తామని ప్రిన్సిపాల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రసూల్, ఎన్ఎస్ఎస్ పీవోలు రమేష్, అనిత, గౌరీశంకరరావు,అధ్యాపకులు పాల్గొన్నారు.

దసరా ఉత్సవాల గోడపత్రిక విడుదల



గోడపత్రికను విడుదల చేస్తున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు

మాడుగుల: చీడికాడ మండలం అప్పలరాజుపురంలో లలితాదేవి శరన్నవరాత్రోత్సవాలకు సంబంధించి గోడపత్రికను మంగళవారం తారువ క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు విడుదల చేశారు. ఉత్సవాల్లో పాల్గొనే భక్తులకు సౌకర్యాలు కల్పించాలని సూచించారు. ఉత్సవాలు ప్రశాంత వాతావరణంలో ఈ నెల 23వ తేదీ వరకు నిర్వహించనున్నట్టు కమిటీ తెలిపింది. సర్పంచ్ చుక్కా అప్పలనాయుడు, మండల నాయకులు కురచా నారాయణమూర్తి, కురచా శ్రీను, గన్ని సత్యంనాయుడు పాల్గొన్నారు.

హోరాహోరీగా వాలీబాల్ పోటీలు



పోటాపోటీగా తలపడుతున్న వాలీబాల్ క్రీడాకారులు

మాకవరపాలెం: తామరంలో జిల్లా స్థాయి వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. దుర్గా దేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో ఈ పోటీలు ప్రారంభమయ్యాయి. జిల్లాలోని వివిధ మండలాల నుంచి 20 జట్లు పాల్గొన్నాయి. ఈ పోటీ ల్లో విజేతలకు ప్రథమ బహుమతిగా రూ.6 వేలు, ద్వితీయ రూ.5 వేలు, తృతీయ రూ.4 వేలు చొప్పున బహుమతులు దసరా రోజున అందజేస్తామని నిర్వాహకుడు గంగిరెడ్ల నాయుడు తెలిపారు. ఇదే హైస్కూల్లో బుధవారం ఉత్తరాంధ్ర స్థాయి కబడ్డీ పోటీలు జరగనున్నాయి.